www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 సెప్టెంబరు 2024 5

ఏలూరు

నేడు, రేపు 'పొలం పిలుస్తోంది'

జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా

ప్రజాశక్తి - ఏలూరు

పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం, బుధవారం జిల్లాలో జరగనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలంబాట పట్టి పంటల సాగుపై చర్చించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం ఒక గ్రామం, బుధవారం ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం ఇంకో గ్రామం చొప్పున మండలంలో షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాల్లో పర్యటించి రైతులకు విస్తరణ సేవలు సమర్థవంతంగా నిర్వహించడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు. రైతు సోదరులందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

డబ్బులు కొట్టు.. జడ్జిమెంట్ పట్టు..!

కెఆర్‌పురం ఐటిడిఎలో గిరిజనులకు అన్యాయం

విచారణ లేకుండానే ఎల్‌టిఆర్ భూములపై జడ్జిమెంట్‌లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనుకుమార్‌పై తీవ్ర ఆరోపణలు

ఆయన వచ్చాక వందల సంఖ్యలో జడ్జిమెంట్‌లు అంటూ గిరిజనులు గగ్గోలు

డబ్బులు తీసుకుని గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన

సిబిసిఐడి విచారణ జరిపించాలంటూ గిరిజన, ప్రజాసంఘాలు డిమాండ్

'గిరిజనులకు అండగా ఉండాల్సిన ఐటిడిఎ అధికారులు, అక్కడి ప్రజాప్రతినిధులు అందుకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారా.. చట్టాలను తుంగలోతొక్కి గిరిజనుల భూములను గిరిజనేతరులకు కట్టబెడుతున్నారా.. ఎల్‌టిఆర్ భూముల కేసుల్లో ఇష్టానుసారంగా జడ్జిమెంట్లు ఇచ్చేస్తున్నారా.. గిరిజనేతర భూస్వాముల నుంచి పెద్దఎత్తున సొమ్ములు తీసుకుని అమాయక గిరిజనులకు అన్యాయం చేస్తున్నారా'.. అంటే అవుననే సమాధానం వస్తోంది. ఎల్‌టిఆర్ భూములపై కెఆర్‌పురం ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇస్తున్న తీర్పులు వివాదాస్పదంగా మారాయి. ఆయన హయాంలో ఇచ్చిన తీర్పులపై సిబిసిఐడి విచారణ జరిపించాలంటూ గిరిజన, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో ఎల్‌టిఆర్ భూములపై జరుగుతున్న అవినీతి వ్యవహారంపై గిరిజనులు భగ్గుమంటున్నారు. డబ్బులు కొట్టు.. జడ్జిమెంట్ పట్టు అన్న చందగా ఐటిడిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టు తయారైందని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ తమకు తీరని అన్యాయం చేస్తున్నారంటూ లబోదిబోమంటున్నారు.

ఐటిడిఎ కార్యాలయం

బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో గిరిజనులకు చెందాల్సిన ఎల్‌టిఆర్ భూములను ఇష్టానుసారంగా గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని 1/70 యాక్ట్ ప్రకారం భూముల బదలాయింపులు ఇష్టానుసారం చేయడం కుదరదు. గిరిజనుల నుంచి గిరిజనులే భూముల కొనాలంటే పెద్ద ప్రక్రియ ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలోని భూములను గిరిజనేతరులు కొనుగోలు చేసేందుకు చట్టం అంగీకరించదు. అందుకు విరుద్ధంగా గిరిజనుల భూములను గిరిజనేతర భూస్వాములకు అధికారులు కట్టబెడుతున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గిరిజనేతర భూస్వాములు చాలామంది ఏజెన్సీలో ఉన్న గిరిజన భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నారు. ఈ భూములపై గిరిజనులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. తమ భూములు తమకు ఇప్పించాలంటూ ఐటిడిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం నోటీసులిచ్చి.. ఇరువురి సమక్షంలో పత్రాలు పరిశీలించి, విచారణ చేసిన తర్వాత జడ్జిమెంట్‌లు ఇవ్వాలి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జి.శ్రీనుకుమార్ వచ్చినప్పటి నుంచి సరైన విచారణ చేయకుండానే ఏజెన్సీలోని ఎల్‌టిఆర్ (ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్) భూములకు సంబంధించిన తీర్పులు ఇచ్చేస్తున్నట్లు గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు. జీలుగుమిల్లి మండలం రామన్నపాలెం గ్రామలోని సర్వే నెంబర్ 2/4 సర్వే నెంబర్‌లో 5.82 ఎకరాల ఎల్‌టిఆర్ భూమికి సంబంధించి గిరిజనులైన పండు రామలక్ష్మి, పండు, నరేంద్రబాబు కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ కోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఐటిడిఎ పిఒగా సూర్యతేజ్ ఉన్నప్పుడు విచారణ చేసి ప్రభుత్వ న్యాయవాది సలహా తీసుకుని గిరిజనులకు చెందేవిధంగా తీర్పు ఇవ్వడానికి సిద్ధమైన సమయంలో ఆయన బదిలీ అయిపోయారు. ప్రభుత్వం ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ భూమిని గిరిజనేతరులకు చెందేవిధంగా శ్రీనుకుమార్ తీర్పు ఇచ్చిన పరిస్థితి నెలకొంది. ఇలా గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇచ్చిన తీర్పులు అనేకం ఉన్నాయి. దాదాపు వందకు పైగా కేసుల్లో ఆయన జడ్జిమెంట్‌లు పాస్ చేసి వేలాది ఎకరాల భూములను గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఎస్‌డిసి జి.శ్రీనుకుమార్ హయాంలో ఇచ్చిన ఎల్‌టిఆర్ భూముల తీర్పులపై సమగ్ర విచారణ చేయాలని పెద్దఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి

జడ్జిమెంట్ ప్రాతిపదికన సొమ్ములు వసూలంటూ ఆరోపణలు

ఏజెన్సీ ప్రాంతంలోని భూములు గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టేందుకు పెద్దఎత్తున అవినీతి పర్వం నడిచినట్లు గిరిజనులు చెబుతున్నారు. గిరిజనేతర భూస్వాములకు తీర్పులు అనుకూలంగా ఇచ్చేందుకు ఎస్‌డిసి జి.శ్రీనుకుమార్ పెద్దఎత్తున సొమ్ములు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జడ్జిమెంట్‌లో ఉన్న భూములను బట్టి రూ.లక్షల్లో సొమ్ములు దండుకుంటున్నట్లు చెబుతున్నారు. ఆయన కాలంలో ఇచ్చిన తీర్పులతో రూ.కోట్లలో అవినీతి సొమ్ముల పోగుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధిత గిరిజనులు వందల సంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు. గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏజెన్సీలో గిరిజనులు రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది.

ప్రజాప్రతినిధుల అండతోనే రెచ్చిపోతున్నారా?

ఏజెన్సీలో గిరిజన తరగతికి చెందిన ఎంఎల్‌ఎలే ఉన్నారు. గిరిజనులకు ఇంత నష్టం జరుగుతున్నా ఎంఎల్‌ఎలు స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధుల అండతోనే ఎస్‌డిసి అవినీతి వ్యవహారం నడిచిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే ఆ ప్రాంతంలోని గిరిజన ప్రజాప్రతినిధులు మాట్లాడకపోవడం ఏంటన్న చర్చ నడుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకుంటే తప్ప గిరిజనులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడంలేదు.

ఎస్‌డిసి శ్రీనుకుమార్ ఇచ్చిన జడ్జిమెంట్‌లపై విచారణ చేయాలి

తెల్లం రామకృష్ణ, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

'ఎల్‌టిఆర్ భూములపై సమగ్ర విచారణ చేయాలి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనుకుమార్ కాలంలో ఇచ్చిన తీర్పులపై సిబి సిఐడి విచారణ జరిపించాలి. రికార్డ్ అసిస్టెంట్ భీమరాజుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. గిరిజనులకు అన్యాయం జరగకుండా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

విచారణ లేకుండా ఇచ్చిన జడ్జిమెంట్లను రద్దుచేయాలి

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

'ఐటిడిఎకు పూర్తిస్థాయి ఐఎఎస్ అధికారిని పిఒగా నియమించాలి. సరైన విచారణ జరపకుండా ఎల్‌టిఆర్ భూములపై ఇచ్చిన జడ్జిమెంట్లను రద్దుచేయాలి. కొత్త ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో సొమ్ములు తీసుకుని గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా తీర్పులు ఇచ్చేశారు. దీనిపై సిబిసిఐడితో సమగ్ర విచారణ జరిపించి గిరిజనులకు న్యాయం చేయాలి.'

లేబర్ కోడ్‌లతో హక్కుల హరింపు

బ్లాక్ డేలో భాగంగా సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మికులను బానిసలుగా మారుస్తూ యజమానులకు ఊడిగం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక హక్కులు హరించబడతాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సోమవారం బ్లాక్ డే కార్యక్రమం ఏలూరు పాత బస్టాండ్ వద్ద నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం కరోనా టైంలో ప్రజలను ఏమార్చి 44 కార్మిక చట్టాలు రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. నాలుగేళ్లుగా కార్మిక సంఘాల పోరాట ఫలితంగా వాటి అమలును నిలిపివేశారని, మళ్లీ వాటి బూజు దులిపే ప్రయత్నాలు చేస్తున్నారని, దాంతో కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. తక్షణం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ, బోనస్, పనిగంటలు కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కును ఈ లేబర్ కోడ్‌లు హరిస్తాయన్నారు. కార్మికులను బానిసలుగా మార్చి కార్పొరేట్లకు వారి శ్రమను దోచిపెట్టడమే లక్ష్యంగా ఈ లేబర్ కోడ్‌లు మోడీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ పార్టీలు కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లకు పార్లమెంటులో మద్దతు ఇచ్చాయని విమర్శించారు. తక్షణం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, జిల్లా కార్యదర్శి కొర్రి విజయలక్ష్మి, నాయకులు మావూరి శ్రీనివాస్, కనకారావు ఐఎఫ్‌టియు నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, ముంగం అప్పారావు, దూల వీరి నాయుడు, కాకర్ల శ్రీను, రాచేటి శ్రీను, గంగాధర్‌రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస డాంగే, ఎ.అప్పలరాజు, భజంత్రీ శ్రీనివాసు, యు.హేమ సుందర్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర నాయకులు చెలశాని వెంకట రామారావు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొస్తోందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్‌ఆర్.హనుమాన్లు, శోభనాద్రి, మరియదాస్, ఎఐటియుసి నాయకులు పుల్లారావు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంతృప్తికరంగా అర్జీల పరిష్కారం ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్ అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీల పరిష్కార రేటును పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందిందీ లేనిదీ పరిశీలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బియాండ్ ఎస్ఎల్ఎ లేకుండా అర్జీల పరిష్కార తీరు ఉండాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీల్లో భాగంగా దెందులూరు మండలం కొవ్వలికి చెందిన నెరుసు మణికంఠకు సంబంధించి తల్లిదండ్రులు అర్జీనిస్తూ నూరుశాతం అంగవైకల్యంతో తమ కుమారుడు బాధపడుతున్నాడని అతనికి ప్రభుత్వం తరపున ప్రత్యేక పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ, డిఆర్‌డిఎ పీడీలను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. సోమవారం మండలం సుంకొల్లు, యనమందల, బత్తులవారిగూడెం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూజివీడు మండలంలో రూ. 43.50 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. యనమందలలో రూ.15 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు, సుంకొల్లులో రూ.7.50 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు, బత్తులవారిగూడెంలో రూ.21 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 100 రోజులు పూర్తిచేసుకున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపిస్తూ ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలచేత అనిపించుకుంటోందని తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది వాలంటీర్లు రెండు, మూడు రోజులు పింఛన్లు పంపిణీ చేసేవారని, కూటమి ప్రభుత్వం కేవలం లక్షా ముప్పై వేల మంది సచివాలయాల సిబ్బందితో ఒక్క రోజులోనే పంపిణీ చేస్తున్నామన్నారు. 5 రూపాయలకే నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్నా క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తామని, మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామన్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూస్తానని, గతంలో మూతపడిన పరిశ్రమలను త్వరలో పునప్రారంభించి తద్వారా మరింత మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. సుంకొల్లు, యనమందల, బత్తులవారి గూడెం గ్రామాల్లో పలు సమస్యలను గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్, మండలాభివద్ధి అధికారి, నాయకులు గద్దె రఘు, ఎన్. వేణు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

పోరాడి సాధించారు..!

ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్లకు అందిన బకాయి జీతాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్లు వారికి రావాల్సిన ఐదు నెలల బకాయి జీతాలను పోరాటం చేసి సాధించుకున్నారు. ఈ నెల రెండో తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం జీతాలు చెల్లించేందుకు జిఒ విడుదల చేసినప్పటికీ బడ్జెట్ రాలేదనే పేరుతో నేటికీ జీతాలు ఇవ్వలేదు. దీంతో సోమవారం ఏలూరు పరిసర మండలాలకు చెందిన స్కూల్ శానిటేషన్ వర్కర్లు ఏలూరు డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ విడుదల చేసి బడ్జెట్ చెల్లించకపోవడం దారుణమన్నారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.దుర్గ, కె.విజయలక్ష్మి మాట్లాడారు. ధర్నా అనంతరం జిల్లా విద్యాశాఖ ఎడిలు అవధాని, షరీఫ్‌లకు వినతిపత్రం అందించారు. అధికారులతో చర్చలు జరిపిన అనంతరం మూడు నెలల జీతాలు విడుదల చేస్తామని వారు తెలిపారు. సాయంత్రానికి వర్కర్లకు జీతాలు అందాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.దుర్గ, కె.విజయలక్ష్మి, నాయకులు గౌసియా, అనంతలక్ష్మి, సాబేరా, పూజిత, కొర్లాపు లక్ష్మి, వరలక్ష్మి,ఎం.దుర్గ, సూర్యకుమారి స్వప్న,రామారావు తదితరులు నాయకత్వం వహించారు. మూడు నెలల బకాయి జీతాలు చెల్లించినందుకు అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు. స్కూల్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన చేపట్టి మూడు నెలల బకాయి జీతాలు సాధించుకున్నందుకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్యకు అభినందనలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, అందరూ ఐకమత్యంగా రానున్న కాలంలో మిగిలిన బకాయి జీతాల కోసం, కనీస వేతనాలు సాధించుకునేందుకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

ధర్నా చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్లు

ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కుక్కునూరు మండలం మాధవరం గ్రామం ఆశ్రమ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఆశ్రమ పాఠశాల హాస్టల్స్ మెరుగుపడాలంటే విద్యార్థుల జీవితాలు త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కుక్కునూరు మండలం మాధవరం గ్రామంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని, ఫ్యానులు లేవని, సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి దుర్వాసన వస్తుందని, వాటర్ ట్యాప్‌లు లేవని, విద్యార్థులు స్నానాలు చేయాలంటే రోడ్డు మీదకు వెళ్లి నీళ్లు తెచ్చుకొని స్నానాలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. వసతి గృహం భవనం పడిపోయే పరిస్థితిలో ఉందని, విద్యార్థులు భయంతో రాత్రిపూట స్కూళ్లలో నిద్రపోయి ఉదయం లేచి తిరిగి హాస్టల్‌కు వెళ్తున్నారన్నారు. ఇంత అధ్వానంగా ఉన్నప్పటికీ ఎందుకని ఇప్పటివరకు అధికారులు ఆశ్రమ పాఠశాల వైపు చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ విషయంపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, జయంత్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఫ్లెక్సీ చించివేత దారుణం

ఎంఎల్‌ఎను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

కలెక్టరేట్ వద్ద మాల జాతి యోధుల పోరాట సంఘం నాయకుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉండి నియోజకవర్గం ఏలూరుపాడు గ్రామంలో అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజును పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాల జాతి యోధుల పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మెండెం సంతోష్, అబ్బూరి అనిల్ మాట్లాడుతూ రఘురామకృష్ణంరాజు ఒక ఎంఎల్‌ఎ ఉండి ఉండి కనీస విలువలు పాటించకుండా, రాజ్యాంగాన్ని గౌరవించకుండా కేవలం హిందూ దేవాలయం పరిసరాల్లో అంబేద్కర్ ఫ్లెక్సీ ఉందని దాన్ని చింపివేయటం తగదన్నారు. అంబేద్కర్ ఒక దళితులకే ఆరాధ్య దైవం కాదని, యావత్ భారతదేశం గర్వించదగ్గ, గౌరవించదగ్గ వ్యక్తి అని అన్నారు. ఇంతటి నీచమైన చర్యకు పాల్పడిన రఘురామకృష్ణంరాజును వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దళితులంతా ఏకమై అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్రి శంకర్, దాసరి శ్యామ్, నూకపెయ్యి కార్తీక్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మాల జాతి యోధుల పోరాట సంఘం నాయకులు

మండవల్లి : మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రవర్తించిన ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అంబేద్కర్ అసోసియేషన్ వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేద్కర్‌ని అవమానించే విధంగా ఫ్లెక్సీని చించివేయడమే కాకుండా అల్లరి మూకలతో కలిసి కులాలను మతాలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదన్నారు. రాజ్యాంగం తెలియని రఘురామకృష్ణంరాజు వంటి ఎంఎల్‌ఎలు ఈ రాష్ట్రంలో ఉండడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను గమనించి రఘురామకృష్ణంరాజును పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దళితుల ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో రఘురాంకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

ఇళ్ల స్థలాలు కాజేసినవారిపై చర్యలు చేపట్టాలి

కలెక్టరేట్ వద్ద వడ్డిగూడెం వాసుల ధర్నా

కలెక్టర్, ఎస్‌పిలకు ఎంఎల్‌ఎ చింతమనేని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేదల ఇళ్ల స్థలాలను కాజేసిన అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని, వందలాది మంది బాధితులకు న్యాయం చేసి వారికి రక్షణ కల్పించాలని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ కలెక్టర్ వెట్రిసెల్విని, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌ను కోరారు. దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన 560 మంది పేద కుటుంబాల ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన 12.18 ఎకరాల పట్టా భూమిని కబ్జా చేసిన వైసిపి నాయకుడిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు మహిళలతో సహా వందలాదిగా సోమవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అక్కడ బైఠాయించి ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని, తమ సొమ్ము తమకు ఇప్పించాలని, వైసిపి నాయకుడిపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న చింతమనేని ప్రభాకర్ ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బాధితులతో కలిసి కలెక్టర్‌కు, ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పికి ఫిర్యాదులు అందించారు. సత్వరమే విచారణ చేపట్టి, పేదలను మోసం చేసిన వైసిపి నాయకుడిపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయంపై జాయింట్ కలెక్టర్‌తో విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూమిని చేపల చెరువుగా మార్చేశారన్నారు. చేపల చెరువులపై వచ్చే ఆదాయాన్ని పూర్తిగా వైసిపి నాయకుడు అనుభవిస్తున్నాడని, గ్రామస్తులకు ఒక రూపాయి కూడా ఇవ్వటం లేదని తెలిపారు. ఇళ్ల స్థలాలు ఇస్తామని తమ వద్ద నుంచి రూ.76 లక్షలు వసూలు చేసిన వైసిపి నాయకుడు గ్రామం మొత్తాన్ని మోసం చేశాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సొంత అవసరాల నిమిత్తం అనేకమంది గ్రామస్తుల వద్ద రూ.లక్షలు తీసుకొని ఇప్పుడు వాటిని తిరిగి ఇవ్వకుండా తీవ్ర వేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. వెంటనే వైసిపి నాయకుడిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

పిజిఆర్ఎస్ అర్జీకి స్పందన

కలెక్టర్ చేతులమీదుగా అర్జీదారునికి కృత్రిమ కాలు

ప్రజాశక్తి - ఏలూరు

శారీరక వికలాంగుడైన యాతం రాజశేఖర్‌కు సోమవారం జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఉచితంగా కృత్రిమ అవయవాన్ని(కాలు) కలెక్టర్ కె.వెట్రిసెల్వి చేతులమీదుగా అందించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీపై స్పందిస్తూ వికలాంగుడు యాతం రాజశేఖర్‌కు ఉచితంగా కృత్రిమ అవయవాన్ని సమకూర్చారు. సదరు అర్జీదారు కోరిక మేరకు వారి అర్హతను పరిశీలించి కృత్రిమ అవయవాన్ని జిల్లా కలక్టర్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిడిఆర్‌సి ఉమా ఎడుకేషన్, టెక్నికల్ సొసైటీ, దొండపాడు, శనివారపుపేటవారు (ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ) ద్వారా కృత్రిమ కాలును తయారు చేయించి అందించారు.

వరద బాధితులకు చిన్నారుల సాయం

ప్రజాశక్తి - ఏలూరు

విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు చిన్నారులు సైతం ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ఏలూరు బాయిస్ కాన్వెంట్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న అనకాపల్లి నందకిషోర్, అనకాపల్లి వెంకట్, ఏడో తరగతి చదువుతున్న శ్రీరాం వారు సేకరించిన రూ.5,045 డిఇఒ ఎస్.అబ్రహం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వికి అందించారు. పాఠశాల సెలవు రోజుల్లో ఇంటింటికి తిరుగుతూ వీరు విరాళాలు సేకరించారు. వీరి సహృదయానికి ముచ్చటపడి విద్యార్థులు సేకరించిన రూ.4,345 తోడుగా ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మెహన్, ఎపిఎంఐపి పీడీ రవికుమార్ మరో రూ.700లను విరాళం అందించారు.

పాఠశాలను సందర్శించిన మాజీ ఎంపీ ఉండవల్లి

ప్రజాశక్తి - చింతలపూడి

నేడు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల్లో చాలామంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నవారేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1969 నుంచి 74 వరకు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకుని అత్యున్నత స్థాయిలో ఉన్న విజయకుమార్‌తో కలిసి సోమవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యను బోధించేవారు అత్యధిక విద్యార్హతలు కలిగిన వారన్నారు. రామచంద్రమూర్తి, రామచంద్రరెడ్డి, గ్రామ పెద్దలు చదువుకున్న పాఠశాలను సందర్శించి విద్యార్థులకు విలువైన సందేశాన్ని అందించారు.



రాజవరంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ఎన్నికల హామీల అమలుకు కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎన్నికల్లో ఇచ్చిన పలు హామీలను నెరవేర్చామని, అన్ని హామీలు అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని రాజవరంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామ సభను మొదటిగా వందేమాతరం గీతంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగాలు, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు, పెంచిన ఫించన్ పంపిణీ, అన్నా క్యాంటీన్లు ప్రారంభం ఇలా అనేక కార్యక్రమాలు చేశామన్నారు. వరదల అనంతరం ప్రభుత్వం నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు వారికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు గ్రామస్తుల వద్ద నుండి పలు వినతులను, ఫిర్యాదులను స్వీకరించారు. రాజవరం ప్రాథమిక పాఠశాల హెడమాస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో రూ.25 వేల చెక్కును వరద బాధితుల కోసం ఎంఎల్ఎకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, మండలాధ్యక్షులు తోట రవి, కూటమి మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలికలపై వరుసకు తండ్రి అయిన వ్యక్తి అత్యాచారం

ఇందుకు సహకరించిన కన్నతల్లి

ఈ కేసులో ఇద్దరికీ జైలు, జరిమానా

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తన సొంత పిల్లలని రెండో భర్తతో గర్భం దాల్చేలా చేసిన మహిళకు, చిన్నారులపై అత్యాచారానికి పాల్పడిన వరుసకు తండ్రి అయిన వ్యక్తికి ఇద్దరికీ జీవిత కాలం జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి రాష్ట్రంలోనే మొదటిసారిగా సంచలన తీర్పు ఇచ్చారు. వివరాల ప్రకారం.. ఏలూరు నగర శివారు వట్లూరు ప్రాంతానికి చెందిన మహిళ పుట్ట విజయలక్ష్మికి, ఒక వ్యక్తికి మొదట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా జరిగిన తర్వాత అనుకొని విధంగా విజయలక్ష్మి భర్త మృతి చెందాడు. దీంతో ఆమె అదే ప్రాంతానికి చెందిన సతీష్‌పవన్‌కుమార్ అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. వీరిద్దరు ఓ క్రూరమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. విజయలక్ష్మి మొదటి భర్తకు పుట్టిన ఇద్దరు కుమార్తెల్లో ఒకరితో మగ బిడ్డను కనాలని సతీష్ విజయలక్ష్మితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. విజయలక్ష్మి పెద్ద కుమార్తెపై సతీష్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెకు ఆడబిడ్డ జన్మించింది. ఆ ఆడబిడ్డను పెంచడం ప్రారంభించారు. పెద్ద కుమార్తెకు కుమారుడు జన్మించలేదని 15 ఏళ్ల వయసున్న చిన్న కుమార్తెపై సతీష్ అత్యాచారానికి పాల్పడడంతో గర్భం దాల్చింది. ఈ విషయం బయటకు తెలియకుండా ఉండాలని యూట్యూబ్ ద్వారా చిన్న కుమార్తెకు ప్రసవం జరిపించారు. ప్రసవం వికటించి ఆ పసికందు మృతి చెందింది. వెంటనే పసికందు మృతదేహాన్ని పక్కనే ఉన్న కాలువలో సతీష్ పడేశాడు. మళ్లీ తిరిగి పెద్ద కుమార్తెపై అత్యాచారానికి పాల్పడడంతో ఆమె గర్భం దాల్చింది. ఇతని ఆగడాలు భరించలేని బాలికలు పోలీసులకు విషయాన్ని తెలిపారు. గతేడాది జులై 12వ తేదీ విజయలక్ష్మి పెద్ద కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి మహిళ పోలీస్‌స్టేషన్ సిఐ ఇంద్ర శ్రీనివాస్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మహిళా పోలీస్ స్టేషన్ సిడిఎస్‌పి నున్న మురళీకృష్ణ పూర్తిస్థాయి దర్యాప్తు చేశారు. ఛార్జి షీటును పోక్సో కోర్టులో దాఖలు చేశారు. వీరి విచారణలో మరో కీలకమైన అంశాలు బయటకు వచ్చాయి. స్థానిక ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసే సత్తార్ పెద్ద కుమార్తెకు జన్మించిన కుమార్తెను సతీష్ విజయలక్ష్మిలు సంయుక్తంగా సరోగసి ద్వారా వేరొక మహిళతో కన్నట్లు, ఆ బిడ్డ ఆ ప్రయివేట్ ఆసుపత్రిలో జన్మించినట్లు ధృవీకరించింది. దీనిని సచివాలయం ఎఎన్ఎం వీణ కూడా ధ్రువీకరించారు. దీంతో పెద్ద కుమార్తె కుమార్తెకు జనన ధ్రువపత్రం మంజూరైంది. పోక్సో కోర్టు న్యాయమూర్తి ఉమా సునంద ఈ కేసును పూర్తిగా విచారించారు. సోమవారం ఈ కేసు విచారణ పూర్తయింది. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి కేసులో ఉన్న పుట్ట సతీష్‌పవన్‌కుమార్, విజయలక్ష్మిఫణిరూపలకు వారు బతుకి ఉన్నంతాకాలం జైలులోనే ఉండేలా యావజీవ కారాగార శిక్ష, రూ.18 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును తప్పుదోవ పట్టిస్తూ పత్రాలు మంజూరు చేసిన ఎఎన్ఎం దూబచర్ల వీణ, ప్రయివేట్ ఆసుపత్రి కంప్యూటర్ ఆపరేటర్ షేక్ సత్తార్‌లకు సత్ప్రవర్తనతో మెలిగే రెండేళ్ల జైలు శిక్షను విధించారు. బాధితులైన బాలికలకు ఒక్కొక్కరికి రూ.పది లక్షలు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

20 వంట గ్యాస్ సిలిండర్లు పట్టివేత

ఉంగుటూరు :నారాయణపురం, చేబ్రోలులో పలు టిఫిన్, భోజన హోటల్లో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వంట గ్యాస్ సిలిండర్లను సోమవారం పట్టుకున్నారు. విజిలెన్స్ సిఐ పి.శివరామకృష్ణ, తహశీల్దార్ బి.కన్యాకుమారి, ఎఐ పి.సురేష్ బృందం స్థానిక అమృత హోటల్, మీర్‌మదీనా హోటల్లో డొమస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని ఫిర్యాదుపై తనిఖీలు చేశారు. అమృత హోటల్‌లో 16, మీర్ మదీనా హోటల్లో నాలుగు మొత్తం 20 గృహ అవసరాల సిలిండర్లను వాడుతున్నారన్నారు. రూ.52,550 విలువైన సిలిండర్లను సీజ్ చేసి నిర్వాహకులపై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సిఐ శివరామకృష్ణ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అత్యుత్తమ ప్రమాణాలతో కోర్సులు

ఎస్‌పిఎఎం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ

26 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి



ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఐటిఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) కోర్సులకు భలే క్రేజ్ లభిస్తుందని ముదినేపల్లి ఎస్‌పిఎఎం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ట్రేడ్ పూర్తిచేసిన వెంటనే వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు వెతుక్కుం టూ వస్తుండడంతో యువత ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతు న్నారని వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక సమాజంలో ప్రతి విద్యార్థికి పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రస్తుతం ఏలూరు జిల్లాలోనే డిజిఇ టి సెంట్రల్ గవర్నమెంట్ చే ఉత్తమ గ్రేడింగ్ పొందిన సంస్థగా ఎస్‌పిఎఎం ఐటిఐని తీర్చిదిద్దామన్నారు.

ఐటిఐ రూటు.. ఉపాధికి చోటు

ఇప్పుడు 'ఐటిఐ రూటు.. ఉపాధికి చోటు'గా మారిందన్నారు. ఐటిఐ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయా రంగాల్లో స్థిరపడే అవకాశాలు వెల్లువలా వస్తున్నాయన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పారిశ్రామిక శిక్షణ సంస్థలు నైపుణ్యాభివృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణలో ఆరితేరేలా తీర్చిదిద్దుతున్నాయన్నారు. చిన్నతనంలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్థిరపడేలా చేస్తున్నాయన్నారు. దీంతో ఇటీవల కాలంలో ప్రతిఒక్కరూ ఐటిఐ వైపు దృష్టి పెట్టారన్నారు. దీంతో కోర్సులకు డిమాండ్ పెరిగిందన్నారు. ట్రేడ్ పూర్తిచేసిన వెంటనే వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వస్తుండడంతో యువత ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు.

డిజిటల్ వర్క్ షాప్

అత్యుత్తమ ప్రమాణాలతో డిజిటల్ వర్క్ షాపులు ఆధునిక సాంకేతిక పరికరాలతో శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా అడ్మిషన్లకు అవకాశం ఉండడంతో ఇటువైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కాగా వందల సంఖ్యలో దరఖాస్తులు రావడం పరిస్థితికి అద్దం పడుతుందన్నారు.

26 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐటిఐలో ఈ నెల 26వ తేదీతో సీట్ల ప్రవేశాలు ముగుస్తాయన్నారు. కృష్ణా, ఏలూరు గోదావరి జిల్లాల్లోని ప్రయివేట్ ఐటిఐల్లో దాదాపు 20 సంవత్సరాల అనుభవం కలిగిన అధ్యాపకులకు అత్యధిక జీతాలు ఇస్తున్న ఐటిఐ కూడా స్పామ్ ఐటిఐ ఒక్కటేనన్నారు. తమ ఐటిఐలో ప్రవేశాలు పొందే విద్యార్థులు తమ తల్లిదండ్రులను వెంట తీసుకువచ్చి ఎక్విప్మెంట్ ఉన్నది లేనిది పరిశీలించి వివరాలు తెలుసుకున్న తర్వాత మాత్రమే తమ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అందుబాటులో మూడు కోర్సులు

ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులను ఆయా ఐటీఐల ద్వారా విద్యార్థులకు అందిస్తున్నాయన్నారు. ఎనిమిది యూనిట్లు ఉన్నాయన్నారు. ఒక్క యూనిట్‌కు 20 మంది విద్యార్థులు, మొత్తం 160 మంది విద్యార్థులకు ఐటిఐలోకి ప్రవేశం ఉందన్నారు. ఒక్కో ట్రేడును పూర్తి చేసేందుకు కొన్ని రెండేళ్లు, మరికొన్ని సంవత్సరం లోపు పూర్తి చేసే అవకాశం ఉందన్నారు.

ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

ఎస్‌పిఎఎం ఐటిఐ 26 ఏళ్లుగా నడిపిస్తున్నామన్నారు.

ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థల్లో...

శిక్షణ తర్వాత స్కిల్స్ ఉన్నవారికి ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థలు, బిహెచ్ఎల్, ఇస్రో, అశోక్ లైలాండ్ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయన్నారు. ఐటిఐ తర్వాత ఉన్నత విద్య కూడా చదవచ్చన్నారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగించాలని ఉద్దేశంతో సరికొత్త కంప్యూటర్లతో శిక్షణ ఇస్తూ ఐటిఐల్లో ఎస్‌పిఎఎం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రవేశం పొందాలనే ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా తల్లిదండ్రులతో పాటు ఐటిఐను సందర్శించి ప్రవేశం పొందాలన్నారు.

నైపుణ్యం కలిగిన అధ్యాపకులు

డీజిల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, పిట్టర్ ట్రేడుల్లో శిక్షణ తరగతులకు అత్యాధునిక నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, అధ్యాపకురాలతో మెరుగైన శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన వెంటనే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి పేద ,మధ్యతరగతి విద్యార్థులు ఏ విధమైన అధిక ఫీజులు లేకుండా కేవలం ప్రభుత్వం వారి నిర్ణయించిన ఫీజు ప్రకారం ప్రభుత్వ ఫీజు రియంబర్స్‌మెంట్ ద్వారా ఉచిత శిక్షణ పొందవచ్చన్నారు. రాయితీతో కూడిన బస్సు పాస్, ట్రైన్ పాస్ ఉన్నారు. దూరపు విద్యార్థులకు ప్రభుత్వం హాస్టల్‌లో ఉచిత భోజనం వసతి కల్పిస్తామన్నారు. ఈ సదవకాశాన్ని కృష్ణా, పశ్చిమ గోదావరి,ఏలూరు జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సత్యనారాయణ కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

సిపిఎం భువనపల్లి, నిడమర్రు, అడవికొలను శాఖ తొమ్మిదో మహాసభలు నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో కె.శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కోసం సిపిఎం కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శాఖ కార్యదర్శి గవర సత్యనారాయణ మూడేళ్ల కాలంలో జరిగిన కార్యక్రమాలు రిపోర్టు నివేదికను చదివి వినిపించారు. మహాసభలో ప్రారంభ సూచికంగా కంచ వరప్రసాద్ జెండా ఆవిష్కరించారు. సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ మండలంలో రొయ్యలు, చేపల చెరువుల సాగుతో గ్రామాల్లో తాగునీటి సమస్య, కాలుష్యం తీవ్రంగా ఉందన్నారు. మంచినీటి చెరువులు, తాగునీరు రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం నూతన కార్యదర్శిగా వెలగలేటి మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కారక్రమంలో కానూరు రాజు, లావేటి సోంబాబు, ఎం.నాగలక్ష్మి, ఎస్.పద్మావతి, లావేటి చంద్రరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని మీర్జాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యుడైన మరీదు జ్ఞానప్రకాష్‌రావు ఇటీవల మృతి చెందాడు. ది కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు మచిలీపట్నం సిఇఒ అమృతలూరు శ్యామ్ మనోహర్ ఉత్తర్వులను అనుసరించి సదరు సభ్యుని భార్య మరీదు ఝాన్సీరాణికు మీర్జాపురం సహకార సంఘం తరపున సంఘ అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి అబ్దుల్ సలీం, మీర్జాపురం సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ గోళ్ల లోకేశ్వరరావు చేతుల మీదుగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సిఇఒ నీలం నాగేశ్వరరావు, స్థానిక నాయకులు దండుబోయిన రవి, దండుపోయిన శ్రీనివాసరావు, పిన్నిబోయిన జోజి, మరీదు వెంకటేశ్వరరావు, పామర్తి బసవ, శ్రీరామ్ పాల్గొన్నారు.

చింతలపూడిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చింతలపూడి

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హి సేవ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని టిడిపి చింతలపూడి మండలాధ్యక్షులు మాటూరు వెంకటరామయ్య, జనసేన పార్టీ మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. చింతలపూడి ఏరియా హాస్పిటల్ వద్ద, చింతలపూడి నగర పంచాయతీ కాంప్లెక్స్ వద్ద ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణరావు, ఆర్ఎంఒ డాక్టర్ ఎస్‌కె.హాఫీజ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోంద్రు దేవా, గుమ్మిశెట్టి భారతి, ఫ్లోరెన్స్‌ల నిర్వహించిన వైద్య శిబిరంలో అన్ని విభాగాల స్పెషాలిటీ వైద్యులు, సిబ్బంది హాజరై ఉచితంగా వైద్య సేవలందించారు.

భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి - పోలవరం

ఇటుకలకోట గ్రామంలో 2005లో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సిపిఎం పోలవరం మండల కార్యదర్శి కోరారు. ఈ మేరకు ఇటుకలకోట గ్రామ గిరిజనులతో కలిసి ఎంపిడిఒ శ్రీనుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు కేటాయించి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బొరగం భూచంద్రావు, కొమరం పోసి రత్నం, సముద్రాలు సాయికృష్ణ, కొప్పల వీరయమ్మ పాల్గొన్నారు.

లంబాడీ హక్కుల పోరాట సమితి గ్రామ కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురంలో లంబాడీ హక్కుల పోరాట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ కమిటీ ఎంపికను నిర్వహించారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా భూక్య వెంకటేశ్వరరావు, బొద్దు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడుగా భూక్య గాంధీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకానాయక్, మహిళా కార్యదర్శిగా దరావతు రాధ, కోశాధికారిగా జరబల చెన్న కేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు ధరావతు రమేష్ నాయక్, భుక్యా రాజా నాయక్‌లు మాట్లాడారు.

చెత్త డంపింగ్ నిలిపివేయాలని వినతి

చింతలపూడి : టి.నర్సాపురం రోడ్డులో చెత్త డంపింగ్ నిలిపి వేయాలని, రోడ్డు క్లియర్ చేయాలని సామాజిక కార్యకర్త ఎస్‌డినాసర్ పాషా కోరారు. ఈ మేరకు చింతలపూడి ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో తహశీల్దార్ డిఎల్.ప్రమద్వర, ఎంపిడిఒ మురళీకృష్ణ, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ శారదకి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి-టి.నర్సాపురం ప్రధాన రహదారిలో చింతలపూడి ఊరి బయట రెండు కిలోమీటర్ల దూరంలో గుర్రాజు గుంట వద్ద చింతలపూడిలో సేకరించిన మున్సిపాలిటీకి చెందిన చెత్తను ట్రాక్టర్లలో డంప్ చేస్తున్నారని, దీని అవకాశంగా తీసుకున్న ఇతరులు కూడా పలు రకాల చెత్తను కూడా డంప్ చేస్తున్నారన్నారు. చెత్తకు నిప్పు పెట్టడంతో రహదారి పొగ కమ్ముకోవడంతో పాటు దుర్వాసన కూడా వెలువడుతోందన్నారు. చింతలపూడి మున్సిపాలిటీ చెత్త డంపింగ్ నివారించాలని, ఇతరులు కూడా చెత్త వేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఆర్ఒ ప్లాంట్ మోటార్‌కు మరమ్మతులు చేయించండి

ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు డిటిఒ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు కొత్త బస్టాండ్‌లో శ్రీ సత్యసాయి ప్రేమామృత ధార పేరుతో ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు ఉచితంగా అందించేందుకు దాతలు ఏర్పాటుచేసిన ఆర్ఒ మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడంలేదు. సోమవారం కొత్త బస్సుల ప్రారంభోత్సవ కవరేజ్‌కు వెళ్లిన ప్రజాశక్తి విలేకరి ఆ విషయాన్ని పరిశీలించి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వాటర్ ప్లాంట్ వద్దకు చేరుకుని పరిశీలించారు. డిపో మేనేజర్ వాణిని, సిబ్బందిని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 15 రోజులుగా ప్లాంట్ పనిచేయడం లేదని, మోటార్ చెడిపోయిందని, ప్లాంట్ ఏర్పాటు చేసిన దాతలకు తెలియజేశామని సిబ్బంది చెప్పారు. సిబ్బంది సమాధానంతో అసంతృప్తి చెందిన ప్రజా రవాణా అధికారి స్పందిస్తూ దాతలు ముందుకు రాకపోతే అవసరమైతే ఆర్‌టిసి సొమ్ముతో అయినా మోటార్ బాగు చేయించాలని, ఒకటి, రెండు రోజుల్లో ప్లాంట్ పనిచేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

5 నూతన బస్సులు ప్రారంభం

ఏలూరు అర్బన్ : గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలన వల్ల నిర్వీర్యం అయిపోయిన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో గాడిలో పెట్టేందుకు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శ్రమిస్తున్నారని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం ఏలూరు కొత్త బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు ఏలూరు - విజయవాడ నాన్ స్టాప్ బస్సులను ఆయన సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లోనే ఈ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 1400 కొత్త బస్సులు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవటమే కాక ఇప్పటికే చాలా బస్సులు ప్రారంభించినట్లు తెలిపారు. అమరావతికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు సమకూర్చినట్లు చెప్పారు. రహదారుల మరమ్మతులకే రూ.290 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు విజయవాడ నాన్ స్టాప్ సర్వీసుల కోసం పనిచేస్తున్న ఐదు పాత అద్దె బస్సులను తీసివేసినట్లు తెలిపారు. వాటి స్థానంలో మూడు అల్ట్రా డీలక్స్, రెండు ఎక్స్‌ప్రెస్ కొత్త బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఏలూరు విజయవాడ నాన్‌స్టాప్ సర్వీసులు ఎలాంటి ఆటంకం లేకుండా 85 ట్రిప్పులు నడుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి పాల్గొన్నారు.

అటవీశాఖ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి

సబ్ డిఎఫ్ఒ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీశాఖ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని సబ్ డిఎఫ్ఒ వెంకట సుబ్బయ్య సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని అంకన్నగూడెం పంచాయతీలో అటవీ శాఖ భూములను స్వాధీనం చేసుకొని కొంతమంది వ్యవసాయం చేస్తున్నారని ఫిర్యాదు మేరకు ఆయన ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ భూములకు సంబంధించిన రికార్డును పరిశీలించగా వాటికి ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు ఉన్నట్లు గుర్తించారు. గిరిజనుల సాగులో ఉన్న వ్యవసాయ భూములను ఆ భూములకు, అటవీ శాఖకు సంబంధం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ భూముల జోలికి వస్తే ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు.

వృత్తి, విద్యా నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థుల్లో వృత్తి, విద్యా నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.చంద్రావతి తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతి చదివే విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యం పెంపొందించేందుకు ఒకేషనల్ శిక్షణలో భాగంగా ట్రైనర్ శ్రావణి అధ్వర్యంలో ఇండస్ట్రియల్ విసిట్‌కి పంపినట్లు తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థులకు టెక్స్ టైల్స్‌లో ఎంబ్రాయిడరీ డిజైన్ వర్క్, కుట్టుమిషన్‌లో మెలకువలు నేర్పించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్యలో కూడా శిక్షణ ఇప్పించడం ద్వార స్వతహాగా ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మంచి చేయాలనే తలంపే గిటురాయిగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రజాహిత పాలనకు శ్రీకారం చుట్టిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. దీంతో పాటు ఆపదలో ఉన్న బాధితులను ఆదుకునే విషయంలోనూ ప్రభుత్వాధినేతలు, ప్రజాప్రతినిధులందరితో పాటూ దాతలు కూడా స్వచ్ఛందంగా ముందుకు ఇచ్చారని చెప్పారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు దాతలు పెద్ద మనస్సుతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని సేవలను విస్తృత పరచాలని సూచించారు. విపత్కర సమయంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.400 కోట్లు దాతలు అందిస్తే ఏలూరు నియోజకవర్గం నుంచే రూ.కోటి విలువైన సేవలను వివిధ రూపాల్లో అందించామన్నారు. తాజాగా ఏలూరు 12 పంపుల స్కూల్‌కు కంకిమళ్ల రవి 20 ఫ్యాన్లను అందించగా, ఆర్యవైశ్య ప్రముఖులు చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య, నున్నా శ్రీనివాస్, పైడేటి రఘు ఆధ్వర్యంలో పలువురికి సేవలందించేందుకు దాతృత్వంతో ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు కొల్లేపల్లి రాజు, బౌరోతు బాలాజీ, పెద్దిబోయిన శివప్రసాద్, లంక వెంకట రాజశేఖర్, చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య, నెరుసు గంగరాజు, దేశు నరసింహరావు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు కరపత్రాలను పంచారు. నాగిడి వీరబ్రహ్మం, ఒడుగు గణపతి, అంగ్రాజు దుర్గారావు, మోకా రామకృష్ణ, కొల్లాటి గోకరణేశ్వరరావు, గ్రామ రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని కాట్రేనిపాడు, కొర్లకుంట, వేల్పుచర్ల, రమణక్కపేట, వేల్పుచర్ల గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు, కార్యాలయ ఎఒ కూచిపూడి సాయిరాం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్ పాల్గొన్నారు.

భీమడోలు : సంక్షోభంలో సైతం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎన్‌డిఎ ప్రభుత్వానికి దక్కుతుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం ఆయన భీమడోలు మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని పెదలింగంపాడు ఆవాస ప్రాంతం, దుద్దేపూడి గ్రామాల్లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

27న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ, ప్రయివేట్ హైస్కూల్ స్థాయి విద్యార్థులు ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజన్ స్వర్ణాంధ్ర-2027 కార్యక్రమంపై వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ నిర్వహించనున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. ఒక్కొక్క పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు హాజరు కావాలన్నారు. మండలంలోని ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల, చెక్కపల్లి, గుడిపాడు, రమణక్కపేట, ముసునూరు, గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు, ప్రయివేట్ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరు కావాలన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు - మూలాలు అనే అంశంపై పిడిఎస్ఒ-స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రమ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సి.విజయ మాట్లాడారు. మహిళలపై, పసిపిల్లలపై అత్యంత దారుణంగా అత్యాచారాలు, హత్యలు, లైంగిక దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టలేకపోతున్నాయన్నారు. యువతను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని విచ్చలవిడిగా డ్రగ్స్, మద్యం, మత్తు పదార్థాలను పాలకులే కుమ్మరిస్తున్నారన్నారు. విష సంస్కృతులకు వ్యతిరేకంగా మహిళలు, విద్యార్థులు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్, చిన్ని , స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు, ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంకలగూడెంలో పౌష్టికాహార మహోత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంకలగూడెంలో సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. తల్లులకు, పిల్లలకు అంగన్వాడీలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అనంతరం తల్లులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శివరత్నకుమారి, జయప్రద, గంగాదేవి, తల్లులు హాజరయ్యారు.

రైతుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

సాగులో సాంకేతిక మెళకువలు నేర్పి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహిస్తామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. రైతన్నల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తుంది కార్యక్రమ పోస్టర్‌ను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఖరీఫ్‌లో నాలుగు నెలలు, రబీలో నాలుగు నెలల పాటు పొలం పిలుస్తొంది కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు సోమవారం స్వచ్ఛతా హి సేవాలో భాగంగా ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో వివిధ విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు 152 మంది పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బిపాల్.సతీష్‌కుమార్ మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ నరేంద్ర కష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దినేష్, డాక్టర్ పద్మజారాణి, డాక్టర్ అజయ్ పాల్గొన్నారు.

ఎబిహెచ్ఎ రిజిస్ట్రేషన్ కౌంటర్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎబిహెచ్ఎ రిజిస్ట్రేషన్ కౌంటర్లను హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ సిహెచ్.సుధాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భరత్ హెల్త్ ఎకౌంటు (ఎబిహెచ్ఎ) నమోదు వల్ల లభించే లాభాలను తెలిపారు. అదేవిధంగా ఎబిహెచ్ఎ ఎపిపిలో నమోదు చేసుకుని, టోకెన్, వైద్య సేవలను పొందే విధానాల గురించి ఎబిడిఎం నోడల్ అధికారిణి డాక్టర్ వి.ఉషాకిరణ్ వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జున, ఆర్ఎంఒ డాక్టర్ దుర్గాకుమార్, ఎబిహెచ్ఎ రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యత గురించి వివరించారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, సీతారాంపురం నార్త్, కునపురెడ్డి మెరకకు చెందిన ఉంగరాల నాగరాజు, తండ్రి: నాగేశ్వరరావు అను నాకు సంబంధించిన **5311/2017, 5312/2017** నెంబరు గల నా **దస్తావేజులతో** మా గ్రామం నుండి మొగల్తూరు వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలపగలరు.

ఉంగరాల నాగరాజు
తండ్రి: నాగేశ్వరరావు, సీతారాంపురం నార్త్,
కునపురెడ్డి వారి మెరక, పిన్: 534280.
సెల్: 9652822999, 9550203013